

వైద్యులకు రక్షణ కల్పించాలి

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్య, అత్యాచారం ఘటన దేశాన్ని నివ్వెరపర్చింది. ఈఘటన వైద్యుల భద్రతకు సవాల్‌గా మారింది. ప్రభుత్వాలు వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు జరగకుండా ఆస్పత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. ప్రధానంగా మహిళ సిబ్బందికి రక్షణ కల్పించాలి. కోల్‌కతా ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– డాక్టర్ అల్లాబకాష్, అధ్యక్షుడు, తాలూకా ఆర్‌ఎంపీ అసోసియేషన్

చట్టాలు కఠినతరం చేయాలి



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన అత్యంత దారుణమైంది. ప్రతి ఒక్కరూ ఆమె ఆత్మకు శాంతి కలిగేలా దేశవ్యాప్తంగా నిరసన ర్యాలీలు, శాంతి ర్యాలీలు చేశారు. ఇలాంటి సంఘటనలు జరిగిన కొద్దిరోజులే హడావుడి చేసి మర్చిపోతారు. వైద్యులకు కష్టం వచ్చినప్పుడు ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపి చట్టాలను కఠినతరం చేయాలి.

– డాక్టర్ బీవీ సుబ్బారావు, చిన్నపిల్లల వైద్యనిపుణుడు, ధర్మవరం

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లోని విద్యాలయాల్లో తెలుగుభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పద్యపఠనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. తెలుగు భాషా అభివృద్ధికి గిడుగు రామమూర్తి చేసిన సేవలను వివరిస్తూ, తెలుగుభాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అలాగే పాఠశాలలో క్రీడా దినోత్సవం నిర్వహించి, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ధర్మవరంలో ఉపాధ్యాయులు, క్రీడా సేవకులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



బత్తలపల్లిలో తెలుగు కవుల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



ధర్మవరం మండలం చిగిచెర్లలో పీడీ ప్రతాప్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రూపరాజా పాఠశాల నిర్వాహకులు



ధర్మవరంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న యశోద పాఠశాల విద్యార్థులు



తెలుగుభాష గొప్పతనాన్ని వివరించేలా వేషధారణలో అలరించిన కాకతీయ విద్యానికేతన్ విద్యార్థులు



కనగానపల్లిలో తెలుగుభాష దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



బుక్కపట్నంలో మాట్లాడుతున్న తెలుగు అధ్యాపకుడు శ్రీనివాసులు



బుక్కపట్నంలో జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న డైట్ అధ్యాపకుడు రామకృష్ణ తదితరులు



కదిరిలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం



గాండ్లపెంటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



ఓడీచెరువులో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో మొక్కలు నాటుతున్న దృశ్యం

క్లుప్తంగా

పోలీసుల సోదాలు



కేసుల్లో ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నారాయణరెడ్డి

కదిరి టౌన్: పట్టణంలోని రౌడీషీటర్లు, గంజాయి, మట్కా తదితర కేసుల్లో ఉన్న వారి ఇళ్లలో గురువారం పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈసందర్భంగా రికార్డులు లేని 3 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారికి సీఐ డీవీ నారాయణరెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. కదిరి సబ్ డివిజన్ స్పెషల్ పార్టీ సిబ్బంది, ఎస్ఐ బాబ్జాన్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా ప్రారంభిస్తున్న ఎలక్ట్రికల్ ఆటోకాడ్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం నారాయణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 5న ఈ కోర్సు ప్రారంభిస్తునట్లు తెలిపారు. కోర్సులో చేరేందుకు ఐటీఐ, డిప్లొమో, బీటెక్, ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. కేవలం 30 మందికి మాత్రమే సీట్లు ఉంటాని, వివరాలకు 9010222175 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేత్రదానం, రక్తదానం గొప్పవి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: నేత్రదానం, రక్తదానం ఎంతో గొప్పవని కంటి వైద్యాధికారి నరసింహులు, ఉరుకుందప్ప అన్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న మధు కంటి ఆస్పత్రిలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రక్తదానం, నేత్రదానం చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా నేత్రదానం ప్రాముఖ్యతను గుర్తించి కళ్లులేని వారికి చూపును ప్రసాదించాలన్నారు. కార్యక్రమంలో ఆఫ్తాలమిక్ అసిస్టెంట్ సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్'పై సమావేశం



సమావేశమైన మండల అధికారులు

కదిరి అర్బన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వికసిత్ భారత్ కార్యక్రమంపై ఎంపీడీఓ అంజనప్ప అధికారులతో సమావేశం నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. మండలానికి సంబంధించి అగ్రికల్చర్, ఇండస్ట్రియల్ సెక్టార్, సర్వీస్ సెక్టార్‌లో ఐదేళ్ల యాక్షన్ ప్లాన్ తయారీపై చర్చించారు.

బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పవన్‌కుమార్

ధర్మవరం అర్బన్: బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా గొట్లూరు పవన్‌కుమార్‌ను నియమించారు. స్థానిక ఎన్జీఓ హోంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ సమక్షంలో రాష్ట్ర కార్యదర్శిగా పవన్‌కుమార్‌ను ఎంపిక చేశారు. బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీసీ న్యాయవాదుల సంఘం నాయకులు రామంజనేయులు, కురుబ మహేష్, అశోక్‌కుమార్, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిమనోహర్

బత్తలపల్లి: మండల అభివృద్ధికి అధికారులు సహాయ సహకారాలు అందించాలని ఎంపీడీఓ సాయిమనోహర్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్పెషలాఫీసర్ ఆధ్వర్యంలో మండల అధికారుల రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన వికసిత్ ఆంధ్రప్రదేశ్‌పై వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, అగ్రికల్చర్ అధికారి ఓబిరెడ్డి, హార్టికల్చర్ అధికారి అమరేశ్వరి, హౌసింగ్ ఏఈ మహేష్, వైద్యాధికారి గంగిరెడ్డి, ఎంఈఓ చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఏపీఓ ఆదెప్ప, ఎఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

గాండ్లపెంట: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓలు క్రిష్టానాయక్, శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, పాఠశాల ఎస్ఎంసీ కమిటీ అధ్యక్షులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం అందేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ ఫొటోలను ప్రతి సోమ, గురువారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, మిగిలిన రోజుల్లో పాఠశాల యాజమాన్య కమిటీలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పాఠశాల యాజమాన్య కమిటీ విధులపై అవగాహన కల్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

సంక్షిప్త వార్తలు

ఎస్ఐకి ప్రశంసాపత్రం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని వెల్దుర్తి గ్రామానికి చెందిన చాకలి సూర్యనారాయణ అనే వ్యక్తి జూలై 20న ధర్మవరం రూరల్ మండలంలో హత్యకు గురయ్యాడు. కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న ధర్మవరం రూరల్ పోలీసులు, చెన్నేకొత్తపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు కలసి సంయుక్తంగా నిందితులను పట్టుకున్నారు. ఈ కేసును తక్కువ కాలంలో చేధించడంతో చెన్నేకొత్తపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లుకు బుధవారం ఎస్పీ వి.రత్న ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆత్మహత్యలే శరణ్యం అని సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు హెచ్చరించారు. గురువారం కొత్తచెరువులో సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు జలదీక్ష నిర్వహించారు. నారా లోకేష్ గారూ.. ఆదుకోండి అంటూ నిరసన తెలియజేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

ముగ్గురికి గాయాలు

నల్లచెరువు: యర్రగుంటపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..కర్ణాటకలోని బిళ్లూరుకు చెందిన బాబూ నాయక్ తన భార్య నీలమ్మతో కలిసి బందార్లపల్లిలోని అత్తవారింటికి వచ్చి గురువారం స్వగ్రామానికి స్కూటర్‌లో బయలు దేరారు. అయితే యర్రగుంటపల్లి వద్ద జాతీయ రహదారి మలుపు వద్ద తనకల్లు వైపుకు వెళ్తున్న మరో బైక్ ఢీకొంది. ఘటనలో బాబూనాయక్, నీలమ్మకు తీవ్రగాయాలయ్యాయి. మరో ద్విచక్రవాహనదారుడు సుమంత్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికులు క్షతగాత్రులను 108లో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైద్య శిబిరం

తలుపుల: ఓబులరెడ్డిపల్లిలో వైద్యాధికారి అష్ఫాఫ్ ఆధ్వర్యంలో గురువారం వైద్య సిబ్బంది వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా 64 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్మోహన్, హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పీ గీతాంజలి, ఏఎన్ఎం అరుణ పాల్గొన్నారు.

ముగిసిన 'ఎఫ్‌డీపీ'

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) గురువారం ముగిసింది. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అటల్ ఇంక్యుబేషన్‌సెంటర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఉద్యోగ కల్పన, అంకుర సంస్థలను ప్రోత్సహించడం, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడంపై డా. చంద్రమౌళి, డా. జ్యోతి, షమీన్ అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులను స్వయం ఉపాధికల్పన వైపు పయనించేందుకు ఈ శిక్షణ తోడ్పడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత పేర్కొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

ధర్మవరం రూరల్: మండలంలోని రేగాటిపల్లి పాఠశాల విద్యార్థులకు, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు గురువారం దర్శనమల వైద్యాధికారి డాక్టర్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించారు. అదే విధంగా చిన్న చిన్న జబ్బులతో బాధపడేవారికి వైద్య పరీక్షలు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు ఆంజనేయులు, సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీలు అశ్విని, అఖిత, భారతి, భాను, హేమలత, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలను రూపొందించండి

ధర్మవరం రూరల్: వికసిత్ భారత్ 2047లో భాగంగా మండలాభివృద్ధికి ప్రణాళికలను రూపొందించాలని మండల నోడల్ ఆఫీసర్, పబ్లిక్ హెల్త్ అధికారి ఈఈ నరసింహమూర్తి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో వివిధ శాఖల అధికారులతో ప్రణాళికలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. అబ్దుల్‌నబి, ఉప గణాంక అధికారి గోపాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన గురువారం రాత్రి పట్టణంలో జరిగింది. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన లక్ష్మీదేవి గురువారం రాత్రి కుటుంబ విషయమై భర్త నారాయణస్వామితో గొడవపడి మనస్థాపం చెంది ఇంట్లోనే విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ధర్మవరం పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బాలకృష్ణ పని నిమిత్తం గొట్లూరు గ్రామానికి వెళ్లి తిరిగి ధర్మవరం టౌన్‌కు టూవీలర్‌లో వస్తుండగా మార్కెట్‌యార్డు సమీపంలో శివశంకర్ అనే మరో వ్యక్తి టూవీలర్‌లో వెనుక నుంచి ఢీకొన్నాడు. ఘటనలో బాలకృష్ణకు స్వల్పగాయాలు కాగా శివశంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

నల్లమాడ: వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని నల్లమాడ సత్యసాయి పంప్ హౌస్ వద్ద కార్మికులు గురువారం బైఠాయించి నిరసన తెలియజేశారు. శ్రీ సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టును కాపాడాలని, ఆరు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, 11 నెలల పీఎఫ్, ఈఎస్ఐ మొత్తాలను వెంటనే జమ చేయాలని, సాయి వాటర్ ప్రాజెక్టుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు నినాదాలు చేశారు. నల్లమాడ, ముదిగుబ్బ, లక్కసముద్రం, కాళసముద్రం, గొల్లపల్లి, పంప్ హౌస్‌లకు చెందిన రాంమోహన్‌రెడ్డి, నాగభూషణ, వెంకటేష్, భాస్కర, శివశంకర, రాజగోపాల్‌రెడ్డి, చంద్ర, క్రిష్టాస్వామి, గంగాధర, వెంకటరెడ్డి, ఉత్తప్ప, తిరుపాల్‌నాయక్, రమేష్ తదితర కార్మికులు పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చంద్ర, సీపీఎం మండల కార్యదర్శి గోవిందు కార్మికులకు మద్దతు తెలుపుతూ నిరసనలో పాల్గొన్నారు.

జీతాలు అందక కుటుంబ పోషణ భారమైంది

తాడిమర్రి: ఆరు నెలలుగా జీతాలు అందక కుటుంబ పోషణ భారమైందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో తొమ్మిదో రోజుకు చేరుకుంది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి జీతాలను వెంటనే మంజూరు చేయాలని వారు కోరారు.

అలాగే నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బోనస్, ఈపీఎఫ్ వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం భగవాన్ సత్యసాయి బాబా చిత్రపటానికి వినతి పత్రం అందించారు.కార్యక్రమంలో కార్మిక నేతలు ఎం.సతీష్, కె.పెద్దఓబిలేసు, పి.తిరుపాల్, రాములప్ప, చిన్నోబిలేసు, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన నోడల్ ఆఫీసర్

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శ్రీ సత్యసాయి జిల్లా పాఠశాల ఆరోగ్య (ఆర్‌బీఎస్‌కే) నోడల్ అధికారి డాక్టర్ నివేదిత గురువారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీ రికార్డులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వ రికార్డులను పరిశీలించారు. త్వరలో జరగనున్న డీ వార్మింగ్ కార్యక్రమానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆల్బెండజోల్ మాత్రలు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం ఆర్. రామాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏజ్ ఆట్ మ్యారేజ్ మీద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీప్తి, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, సూపర్‌వైజర్ మహబూబ్ బాషా, ఏఎన్ఎం యశోద, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, శ్యామల, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో మందులు పరిశీలిస్తున్న నోడల్ అధికారి డాక్టర్ నివేదిత

ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలి

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ అనుపమ, మున్సిపల కమిషనర్ అంజయ్య తెలిపారు. గురువారం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ అక్టోబర్ 18 వరకూ నిర్వహించే ప్రీ రివిజన్ యాక్టివిటీలో భాగంగా ఇంటింటి సర్వే పూర్తి చేయాలన్నారు. బీఎల్‌ఓలు సర్వేకు వెళ్లి వివరాలను బీఎల్ఓ యాప్ లోనే అప్‌లోడ్ చేయాలన్నారు. మరణించిన వారి వివరాలు, అడ్రస్ మారినా, డబుల్ ఎంట్రీలు ఉన్నా నమోదు చేయాలన్నారు. 18 ఏళ్లు వయస్సు నిండిన వారు యువతీ యువకులు ఉంటే ఓటరుగా నమోదు చేయాలన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ అనుపమ, కమిషనర్ అంజయ్య

మరుగుదొడ్ల పనుల బాధ్యతల నుంచి తప్పించండి

పుట్టపర్తి: ఉపాధ్యాయులను మరుగుదొడ్ల పనుల బాధ్యతల నుంచి తప్పించాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏడీ నాగరాజు, డీవైఈఓ రంగస్వామికి వినతిపత్రాలు అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ఉపాధ్యాయులకు మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతలను తప్పించినా, మరింత భారాన్ని మోపే పనులను అప్పగించడం దారుణమన్నారు. రోజూ సాయంత్రం 3 గంటల నుంచి 3.30 గంటల మధ్య పది అంశాలతో కూడిన గూగుల్ ఫాంను పూర్తి చేసి అప్లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శులు శివశంకర్, నరేష్‌కుమార్, లక్ష్మీనారాయణ, బాబు, రవీంద్రరెడ్డి, లక్ష్మయ్య, బాబావలిశ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



కూరగాయల విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: సేంద్రియ వ్యవసాయంతోనే పంటలు సాగు చేయాలని టింబక్టు కలెక్టివ్ ప్రతినిధులు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని టింబక్టు కలెక్టివ్ కార్యాలయంలో సేంద్రియ కూరగాయల సంఘం రైతుల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టింబక్టు కలెక్టివ్ ప్రతినిధులు బబ్లూ గంగూలి, మేరీ వటమట్టం మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎక్కువ మంది రైతులు రసాయన ఎరువులు వాడుతున్నార న్నారు. తద్వారా భూమి సారవంతం కోల్పోవడంతో పాటు రైతులకు మేలు చేసే అనేక రకాల సూక్ష్మజీవులు నశిస్తున్నాయని తెలిపారు. మనం పండించే పంటలు ఆరోగ్యకంగా ఉండాలన్నారు. రేపటి తరాల వారిని సారవంతమైన భూమిని అందించాలంటే సేంద్రియ పంటను పండించాలన్నారు. అనంతరం రైతులకు వివిధ రకాల కూరగాయల విత్తనాలు, కలుపు తొలగించే పరికరాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఏడీ సుకన్య, ధరణి సీఈఓ రమేష్, ప్రోగ్రాం మేనేజర్ మహేష్, కోఆర్డినేటర్ శివప్రసాద్ రెడ్డి, ధరణి అధ్యక్షుడు పోతన్న పాల్గొన్నారు.

వైభవంగా ఊరేగింపు



శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి ప్రతిమను గురువారం పట్టణంలో ఊరేగించారు. మూడు రోజులపాటు శ్రీకృష్ణుని విగ్రహాన్ని కొలువుదీర్చి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు.

మద్యం స్వాధీనం



అక్రమ మద్యం, నిందితుడిని చూపుతున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం అర్బన్: అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం అక్రమ మద్యం స్వాధీనంతోపాటు వ్యక్తి అరెస్టు చూపించారు. సీఐ మాట్లాడుతూ పట్టణంలోని శారదానగర్‌కు చెందిన గాజుల ఆనంద్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. అతడి నుంచి రూ.29,400 విలువ చేసే 180 మద్యం బాటిళ్లు, 12 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశామన్నారు.